



“తలుపులు మూస్తున్నారా?”

తాళం వేయబోతూ ఆశ్చర్యంగా వెనుదిరిగి చూసేడు శ్రీకృష్ణ.


వసుంధర ఒక్కత్తే కనపళ్ళేదు ఆమె అందమయిన అరచేతులమధ్య ఓ స్టీలు పళ్ళెం. దాన్నిండా దసరా ప్రసాదం వగైరాలు.

కళ్ళెత్తి చూసేడు.

ఆవిడ పగడపు పెదవుల మీద లాస్యవిలాసం

“ఇవన్నీ నా కోసమేనా?”

ఈమాటు ఒక వీణ పలికింది



"లేకపోతే యిదేమన్నా మంగళారతి పళ్లెం అనుకున్నారా, కళ్ళకద్దుకోండి అని చెప్పేందుకు?" నవ్వుతూ వ్యంగ్యంగా ప్రశ్నించింది.

శ్రీకృష్ణ కళ్లు ఆమె అందమయిన కపోలాలమీద, బిగించిన అధరద్వయం మీద, ఆ ప్రశ్న వేసినపుడు కళ్ళల్లోంచి జారుతున్న కాంతులవైపు తిరిగేయి

తాళం చేత్తో పట్టుకుని, మళ్ళీ తలుపులు తీసాడు.

లోపలికి అడుగు వేసాడు.

వసుంధర-అక్కడే-గుమ్మందగ్గర!

ఆశ్చర్యంగా చూసి "ఏం? లోపలికి రాకూడదూ?" అన్నాడు.

"ఊఁహూఁ....."

"ఎందుకని?"

"అమ్మ త్వరగా వచ్చెయ్యమంది!"

"అమ్మ లెప్పుడూ అంతే! మా అమ్మా చెప్పింది—ఆడపిల్లలకేసి చూడకు, మాట్లాడకు మని."

వసుంధర కళ్ళు మరింత విశాలం చేసి "నిజం?" అంది.

"నిజం-కావాలంటే ఒట్టు వేస్తాను."

"ఒద్దులెండి. నేను వెళ్ళాలి. ప్లీజ్! పళ్ళెం అందుకోండి."

"అయితే వెళ్ళరండి—" మళ్ళీ చెప్పుల్లో కాళ్ళు దూర్చాడు.

హతాశురాలైంది.

"పళ్ళెం అందుకోరా?" అభ్యర్థన.

"లోపలికి రారా?"

"మీ పట్టుదల వదలరా?"

"మరి మీ పట్టుదల?"

"హే భగవాన్ ఊఁ. గడప దాటాను. ఇకనైనా పళ్ళెం అందుకుంటారా?"

"హే భగవాన్! ఊఁ .ఒక్కక్షణం అలా కుర్చీలో కూర్చుంటారా?"

"మళ్ళీ అదొకటా?"

"అదొక్కటే!"

"కూర్చున్నాను."

"థాంక్స్! యిప్పుడు చెప్పండి. నేను మీ కళ్ళకి ఎలా అవుపిస్తున్నాను?"

చిన్న బుచ్చుకుంది—

"ఇదిగో మీరలాంటి ప్రశ్నలు వేస్తే నేను వెళ్ళిపోతాను."

"అదుగో మీరలా ప్రతిచిన్నమాటకీ చిన్నబుచ్చుకుంటే మరెన్నడూ పలకరించను, పలకను ఇంతకీ నేను మీకు మనిషిలా కనపడుతున్నానా లేక రాక్షసుడిలా. "

"అబ్బబ్బ ఏమి మాటలండీ మరీనూ. . "

"అవసరం మొచ్చింది, అందుకని."

"శ్రీకృష్ణుడు రాక్షసుడెలా అవుతాడండీ?" అంతలోనే చిలిపితనం.

"అవడు కద? హమ్మయ్య! అయితే ఫర్వాలేదు. మీ అమ్మకీ మాట చెప్పండి, మేడ మీదున్నాయన రాక్షసుడు కాదు మనిషే... ఆయన మనుషుల్ని తినడు. కాబట్టి, భయం లేదని. తెల్సిందా? ఇహఁ ఆ పళ్ళెం యిలా యిచ్చి మీరు వెళ్ళండి. క్రింద మీ అమ్మ నిముషాలు, మీన మేషాలు లెక్కెస్తోందేమో!"

వసుంధర రెండు కళ్ళూ తడి అయినాయి.

గమనించాడు శ్రీకృష్ణ.

"అరరె! ఆగండాగండి. ఆ రెండు కన్నీటి చుక్కలు జారిపడ్డాయంటే నేను మనయిపోతానంతే.. "

బాధని జయించిన నవ్వు.

"ఎంత దుర్మార్గులండీ. ఆ నవ్వునలా చెఱపట్టకపోతే, స్వేచ్ఛ నివ్వకూడదూ?"

"మీతో నేను మాట్లాడలేను బాబూ!"

"మాట్లాడకుండానే జయిస్తున్నారుగా?"

పళ్ళెం కుర్చీలో వదలి పారిపోయింది.

నవ్వుకున్నాడు శ్రీకృష్ణ.

* * *

"ఓ హో ఉన్నారా? లేరనుకున్నాను!"

పేపర్లోంచి తల తిప్పి చూసేడు.

తెల్ల చీర—మల్లెపూలు.

మనసులో ఏదో పాటమెదలి పెదవుల మీద "ఎవరికోసమూ?" అనే అక్షరాలు కదిలాయి, చిరునవ్వు నవ్వేడు.

"అదా మీ సమాధానం?" గడుసుగా అడిగింది.

"వసుంధరా! మీ అమ్మ ఏంచేస్తోంది?"

ఆమె మొహంలో మార్పు.

'అడగవలసింది కాదు' అనుకున్నాడు తీరా అడిగేసాక.

తల దించుకుని ఓ క్షణం మౌనం. తర్వాత "వెళ్లొస్తాను" అని వెను దిరిగింది.

"ఆగు—"

భుజం మీదనుండే చూసింది.

ఆ పెద్ద కళ్ళలోని వెలుగు, చుబుకంలోని సొగసయిన ఒంపు, ముంగురుల్లోని నలుపు చూసి "కోపం వచ్చింది కదూ?" లాలనగా అన్నాడు.

"మా అమ్మ ఎదురు చూస్తుంటుంది!" మెట్ల మీద నుండే గునగున నడిచి వెళ్ళిపోతుంటే-ఆ జడకేసీ, మల్లెపూల కేసీ కనుమరుగయ్యేవరకు చూసి, గోళ్లు కొరుక్కున్నాడు శ్రీకృష్ణ.

ఆ మర్నాడు—

తలుపు తట్టిన శబ్దం విని అమాంతం లేచి కూర్చున్నాడు.

ఎదురుగా అద్దంలో తనని తను సరిదిద్దుకుని ఉషారుగా తలుపు తీసాడు.

నీలవేణమ్మ-వసుంధర తల్లి!

నీరుగారి పోయేడు.

"బాబూ! ఆయన నిన్న క్యాంప్ వెళ్ళేరు. అమ్మడికి రాత్రి నుంచీ ఒకటే జ్వరం. అసలే ఊరంతా ఫ్లూ జ్వరాలు. ఇంట్లో ఒక్క పసివెధవ తప్ప ఎవ్వరూ

---

○ "మంచి అల్సేషియన్ కుక్క అమ్మకమునకు ఉన్నది. ధర సరసము ఆహారం విషయంలో ఇబ్బంది లేదు. ఏదైనా తింటుంది. చిన్న పిల్లలన్న చాలా ఇష్టము."

లేరు....'' అప్పటికే సగం మెట్లు దిగేశాడు శ్రీకృష్ణ.

నుదురు కాలిన పెనంలా ఉంది.

చెయ్యి తగలగానే కళ్లు తెరిచింది. ఎరుపు జీరలు, పల్చటి నీటి తెర.

''తియ్యకండి, చెయ్యి అలాగే ఉంచండి'' జీరపోయిన గొంతుతో అర్థించింది.

''ఇంట్లో ఉడుకులాం ఉందాండీ?''

''ఉండాలి–చూసి చెబుతాను బాబూ'' లోపలికి వెళ్లింది, నీలవేణమ్మ.

ఆ చేత్తోనే. ధర్మామీటరు కూడా తెచ్చింది.

—నూటనాలుగు డిగ్రీలు!

''ఎంత ఉంది?'' నీరసంగా వసుంధర గొంతు.

తడబడ్డాడు. ''నూట ...ఒకటి... ''

''కాదు—నాకు తెలుసు. నాకు చాలా సార్లు నూటవొకటి వచ్చింది. ఇది యింకా ఎక్కువ.'' ఆమె పెదవులు అదురుతున్నాయి. ఎర్రటి మొహం మరింత ఎర్రగా ఉంది.

నుదుటి మీద రెండు మడతలు వేసి 'యుడికోలోన్'తో తడిపాడు గుడ్డని.

''మీరు నుదుటిమీద చెయ్యివేస్తేఎంతో బావుంది '' కళ్లు మూసుకుంటూ అంది.

''నీలవేణమ్మగారూ! నేనలా బజారెళ్లి కావలసిన మందులు తెస్తాను. మీరువసుంధర ప్రక్కన కూర్చోండి... ''

మెట్లవరకూ వచ్చి ''బాబూ! భయం లేదు కదు? ఆయనకి టెలిగ్రాం యివ్వమంటావా?'' ఆదుర్దాగా మొహంలోకి చూస్తూ అడిగింది.

శ్రీకృష్ణ మనసులోనే నవ్వుకున్నాడు. 'ఎంతయినా తల్లి తల్లే!'

''మరేమీ భయంలేదు. నా మిత్రుడొకాయన మంచి ఫిజీషియను. కేసు గురించి చెబుతాను. అవసరమంటే వెంట బెట్టుకొస్తాను.''

ఆవిడ మనసులో శంక తొలిగి, మొహం తేటపడింది.

''వెళ్లిరా బాబూ! ఏదో చాదస్తంగా అడిగి బాధ పెట్టాను.''

''అదేమీ లేదు.. ''

రూమ్ తాళం వేసి వీధిలోకి నడిచాడు.

* * *

ఆ వెన్నెల–నిండు పున్నమి వెన్నెల.

వెన్నెల వెలుగుల వెంట నల్లని నీడలు. వాటిని చూస్తూ కూర్చున్నాడు శ్రీకృష్ణ. చేతిలో చిన్న ఆల్బమ్ ఉంది, టేబుల్ మీద చిన్న అట్టపెట్టె ఉంది. దాన్నిండా ఎన్నో అనుభూతుల్ని జ్ఞప్తికి తెచ్చే ఉత్తరాలు.

ఆల్బమ్‌లో మొదటి పేజిలో రాధ ఫొటో ఉంది.

అట్టపెట్టెలో మొదటి నాలుగు ఉత్తరాలు కూడా రాధవే.

రాధ తర్వాత జ్యోతి ఫొటో, ఆమె ఉత్తరాలు.

తర్వాత—భవాని!

సరోజ

సుజాత ..

సత్యవతి

విసుగ్గా టేబుల్ మీద అల్బమ్ పడే సాడు శ్రీకృష్ణ,

కళ్లు మూసుకున్నాడు.

వసుంధర—పెద్ద కళ్లు, నల్లటిముంగురులు, మల్లెపూలు, తెల్ల చీర.

నవ్వుతోంది!

"ఏమిటంత బాధ పడుతున్నారు?"

ఉలిక్కి పడ్డాడు.

"అరే! యింత నిశ్శబ్దంగా ఎలా వొచ్చావ్?" ఆశ్చర్యంతో కొట్టుమిట్టాడేడు.

"నడిచి... "

"నను లాలింపగ నడిచి వచ్చితివా!" పక పక నవ్వేడు.

పెదవి విరచి "లేదు—ఊరికే నే వొచ్చాను...." నవ్వు దాచుకున్నట్లు తెల్సిపోతోంది.

ఆల్బమ్, అట్టపెట్టె, సొరుగులోకి నెట్టేసాడు.

"కూర్చోవటానికి అభ్యంతరం ఉందా?"

కుర్చీకి అందం, నిండుదనం వచ్చాయి.

"ఒంట్లో నీరసం తగ్గి కులాసాగా ఉందా?" తలస్నానం చేసిన గుర్తుగా పొడిగా ఉన్న జుట్టు చిరుగాలికి చలిస్తోంది.

"లేకపోతే పాతిక మెట్లెక్కి సునాయాసంగా రాగలనా?"

నవ్వేడు.

"నిజం! మీ ఆడవాళ్లు చాల చిత్రమైన వాళ్లు ..."

"ఎంతమందిని చూసారేం?"

షాక్ తిన్నాడు—

"వసుంధరా...."

"అయామ్ సారీ! అనాలోచనగా అన్నాను, ఏమీ అనుకోకండి ప్లీజ్..."

"ఇట్సాల్ రైట్!"

క్షణాలకు కూడ మౌనం తెలుసు.

ప్రకృతికి కూడ మూగబోవటం వచ్చు.

ఆమెలేచి అలా ఆరుబయటికి, డాబా మీద పరుచుకున్న వెన్నెల్లోకి నడిచింది.

కొంతదూరం నడిచి, ఆగి యిటు చూసింది.

శ్రీకృష్ణ యింకా కుర్చీకి అతుక్కునే ఉన్నాడు.

"వెన్నెల అంటే యిష్టం లేదా?"


లేచి అటు నడిచాడు.

పిట్టగోడ దగ్గరున్న కుర్చీల్లో కూర్చున్నాక, అంది.

"ఇంకా మీరు కోపంగానే ఉన్నారు. నాకు వెన్నెల వేడిగా ఉంది అందుకే...."

నవ్వేసాడు.

"మీ అమ్మగారు...." నోరు మెదపబోయి గుటకలు వేసేసాడు.




ఎందుకనో యిదో పెద్ద జాడ్యమై పోయింది.

నోరు జారటం—బాధ పడటం. ఆవేళ వసుంధర అలా అనకపోతే, తన మనసులో యీ మాట యిలా ముద్రలా పడి ఉండేది కాదు.

పిట్టగోడ మీద చేతులువేసి, పైన చుబుకం ఆన్చి తదేకంగా దొడ్డికేసి చూస్తోంది వసుంధర. ఎత్తుగా ఎదిగిన చెట్లు. పాడు పడిన బావి. అంతే!

"ఏదైనా మాట్లాడు వసుంధరా!"

"ఏమి మాట్లాడను?"

"ఏదో ఒకటి... "

"ఏమి మాట్లాడినా వింటారా?"

"తప్పకుండా...."

"ఒక కథ చెబుతాను."

"వెరీగుడ్ ... "

"చాలా పాత కథ. మామూలుగా జరిగే కథ, ఇంకా ఎప్పటికీ జరిగే కథ!"

"చెప్పు వింటాను."

"ఒక అమ్మాయి—పేరు వసుమతి."

"నువ్వు కథ మొదలెట్టినప్పుడు అబ్బాయితోనే మొదలెట్టాలి. అప్పుడే అందం!"

"ఆల్‌రైట్! అబ్బాయి పేరు ఆనందరావు. అందంగానే ఉంటాడు, ఆకర్షణగా మాట్లాడతాడు. అతనికి మెడిసన్‌లో సీటు వొచ్చింది. అతని సీటు పక్కన వసుమతి సీటు!

ఇద్దరికీ పరిచయాలు కలిగేయి.

నాలుగో సంవత్సరం వొచ్చేసరికి ముదిరేయి.

అన్నట్లు .ఆనందరావు వసుమతి ఇంట్లోనే ఒక రూమ్‌లో ఉండేవాడు. అతని నడవడి, ప్రవర్తన వసుమతి ఇంట్లో వాళ్ళకి కూడ నచ్చాయి. వసుమతి అత

నితో చనువుగా ఉన్నా అపార్థాలు తీసుకో లేదు।

వాళ్లు తీసుకోకపోయినా జరగవలసిన అనర్థాలు ఆగలేదు।

ఆనందరావు మెడిసన్ పూర్తి చేసాక వీడ్కోలు చెప్పి వెళ్లిపోయేడు.

ఒక వారం తర్వాత, దొడ్డిబావిలో వసుమతి శవం తేలింది ”

వెక్కి వెక్కి ఏడుస్తోంది వసుంధర.

శ్రీకృష్ణకి మతి చలించినట్లయింది. “ఏమిటిది వసుంధరా? ఎందుకిలా ఏడుస్తున్నావ్?” గాభరాగా అడిగేడు, మొహం పైకెత్తుతూ.

“వసుమతి మా అక్క, ఆ బావి అదే। అది చచ్చిపోయింది సరిగ్గా పున్నమి రోజున. .” వేలితో దొడ్లో పాడుబడ్డ బావి చూపింది.

* * *

ఉత్తరం పూర్తి చేసేడు.

ఒక మాటు మళ్లీ చదువుకున్నాడు.

“నేను ఆనందరావు లాంటి వాడిని కాను. ఆడపిల్లల్ని చూస్తే ఆకర్షణ.ముట్టుకుంటే ఆపద। ఈ సృష్టిలో యిలా ఎందుకు ఉందో నాకు తెలియదు. చాలా మంది ఆడపిల్లలు నా చుట్టూ తిరిగేరు. కానీ, ఆనందరావు చాలా ఆడపిల్లల చుట్టు తిరిగాడు.

చాలా మంది జీవితాలతో చెలగాటాలాడేడు.

ఆడుతున్నాడు కూడ.

కానీ—

నేను అలా చెయ్యలేక పోయేను.

అసమర్థత వల్ల కాదు. అయిష్టతవల్ల ః

“లేకపోతే—ఎందరో ఆడపిల్లలు కాపురాలు చేసుకో గలిగిఉండేవాళ్లు కాదేమో!


మనిషీ మనిషీ మధ్య—మంచితనం, పరస్పర గౌరవం, నిజాయితీ, పాపభీతి లాంటివి ఉండితీరాలనే విశ్వాసం నాలో వేళ్లు పాతుకుని పటిష్ఠంగా లేకపోతే నేను ఆనందరావు కేమీ తీసిపోయేవాడిని కాను. ఏ మనిషయినా అంతే.

ఆశ్చర్యపోనంటే ఆనందరావునాకు పిన్నికొడుకు—అంటే, అన్న!

నువ్వు మీ అక్క వసుమతి జీవితం గురించి విచారిస్తుంటే నేను అలాంటి ఎందరో అబలల జీవితాలు నలిగి నాశనమై పోయినందుకు తల్లడిల్లుతున్నాను. మీ కుటుంబానికి ఆనందరావు వల్ల తీరని అపచారం జరిగింది నిజం. అందుకేమన్నా నిష్కృతి ఉంటే, నేను చేయగలిగిందల్లా నీ జీవితాన్ని నాతో ముడివేసుకుని, మీలోని గాయాన్ని మాన్చటమే. వసుమతి ఆత్మశాంతి కిదొక్కటే మార్గమని నాకు తోస్తున్నది.

—శ్రీకృష్ణ”

జ్యోతి




ఆల్బమ్, అట్టపెట్టె ఒకదాని మీద ఒకటి ఉంచి అగ్గిపుల్లతో వెలిగించాడు.

మంటలు—

కాలిపోతున్న మూగ కోరికలు, వేదనలు,ఎవరివో....ఎవరెవరివో .... నుసిగా రాలుతున్న రూప చిత్రాలు.

"వసుంధరా! నీ వాడిని నేను...." మంటలు ఆరిపోతూ ఆ మాటలు విన్నాయి.

* * *

'శ్రీకృష్ణ' కాళ్లు ఆగిపోయినాయి.

ఎదురుగా వరండాలో పడక్కుర్చీలో కూర్చుని ఉన్న కుష్ఠురోగిని చూసి తెల్లబోయేడు. 'ఎవరితను? నీలవేణమ్మ గారింట్లో ఇంత దర్జాగా కూర్చోవట మేమి టనుకుంటూ.

"చూడండి!వసుంధర ఇంట్లో ఉందా?" పశ్నించాడు.

ఉరిమి చూసేడు అతను.

శ్రీకృష్ణ కళవళ పడ్డాడు.

అతని ధోరణి చూస్తుంటే వేపకాయంత వెర్రికూడ ఉందేమొ ననిపించింది.

అంతలో—

చేతిలో కాఫీ కప్పుతో వసుంధరే బయటికి వొచ్చింది.

'ఎక్కడ కాఫీ ఒలికిపోతుందో' అన్నంత పదిలంగా పట్టుకుని, దృష్టినంతా చేతిమీదనే కేంద్రీకరించి.

శ్రీకృష్ణని గమనించలేదు.

ఎలాంటి సంకోచము, అసహ్యము లేకుండా, అతనికి—ఆ కుష్ఠువాడికి అతి సమీపంగా వచ్చి, పైగా పెదవి మీద చిరునవ్వుతో, కాఫీ అందిస్తుంటే ... అలాగే నిలబడి చూసేడు శ్రీకృష్ణ.

అందుకుంటూ "ఎవరతను?" కర్కశంగా అన్నాడు శ్రీకృష్ణకేసి చూస్తూ.

ఉలిక్కిపడి యిటు చూసింది.

మందహాసం చేశాడు శ్రీకృష్ణ.

బెదురు, బెదురుగా ఇంట్లోకి వెళ్ళిపోయింది.

విజేతలా, వికటంగా నవ్వేడు ఆరోగి!

శ్రీకృష్ణ మెల్లిగా వెనుదిరిగేడు.

"ఎందుకిలా జరిగింది? ఎవరతను? ఏమిటతనికా యింట్లో ఉన్న అధికారం? పన్నెన్నుగా ఉందే!"

మెట్లెక్కుతున్నాడు.

వసుంధర మాటలు గుర్తుకువొచ్చాయి.

"పాతిక మెట్లెక్కి...."

"ఈ మెట్లు పాతికా? తనెప్పుడూ లెక్కపెట్టనే లేదు....ఒకటి, రెండు."

* * *

"ఇరవై అయిదు!" చివరి మెట్టు దిగి నవ్వుకున్నాడు.

'ఈ మధ్య యిదొక పాడు అలవాటైపోయింది!' అనుకున్నాడు.

అడుగు వేయబోతున్నవాడల్లా ఆగిపొయ్యాడు.

అప్పుడే అల్యూమినియమ్ బేసిన్‌లో గోధుమరవ్వ తెచ్చి ఎండలో ఆరబెడుతోంది వసుంధర.

సమీపానికి వెళ్లేడు.

బెదురుగా కళ్ళెత్తి చూసింది.

"వసుంధరా! ఎందుకిలా దూరంగా ఉంటున్నావ్. చెప్పు—నీ కిష్టంలేకపోతే నా ఉత్తరాన్ని నా మొహానికేసి కొట్టకపోయావా? సమాధానం యిచ్చే కనీస మర్యాదకూడ మర్చిపోయేవా?" ప్రతి అక్షరంలోనూ బాధ—గుండెలు తొలిచేసే బాధ.

లేచి, ఆదరా, బాదరా వెళ్ళబోయింది.

చెయ్యిపట్టుకుని నిలిపేడు.

వణికిపోతోంది.

కళ్ళనిండా నీళ్ళు.

"నన్ను క్షమించి వెళ్ళనీయండి!"

"లేదు వసుంధరా! కారణం చెప్పి వెళ్ళు. నన్ని యిల్లువిడిచి వెళ్ళిపొమ్మని కూడా చెప్పి వెళ్ళు."

"ప్లీజ్! నన్ను బాధించకండి."

"నేను.... నిన్ను .... బాధిస్తున్నానా వసుంధరా?" చెయ్యి వదిలేసాడు.

మెడలో సన్నటిగొలుసు పట్టుకుని "ఈ గొలుసు ...ఈ గొలుసు...." ఆవేశంతో మాటలు రాక తడబడుతోంది. బుగ్గలమీద ధారలు కట్టిన కన్నీళ్లు.

"చెప్పు ...ఏమిటి? ఆ గొలుసులో ఏముంది?" ఆత్రంగా అడిగేడు.

"ఈ గొలుసు చివర రెండు పులిగోళ్ళున్నాయి. అవి నా గుండెల్ని చీలుస్తుంటాయి....అందుకే."

"వసుంధరా!" అయోమయంగా, అర్థం కానట్లు చూసేడు.

మరుక్షణంలో గొలుసు పైకి వొచ్చింది.

దాని చివర రెండు పులిగోళ్ళకి బదులు మంగళ సూత్రాలు!

సరిగ్గా—వసుంధర వెనక వున్న కిటికీలోంచి అనుమానంగా, ఆగ్రహంగా, సాధికారంగా చూస్తున్నాడు కుష్ఠురోగి....

అతని కలల్ని భగ్నంచేసిన కుష్ఠురోగి!